## కందుల కొనుగోళ్లు నిలిపివేత

బోథ్, ఫిబ్రవరి 25: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మార్కెట్ కమిటీ యార్డులో మార్క్‌ఫెడ్ సహకార సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న కందుల కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కేంద్రం ఇన్‌చార్జి గోలి స్వామి తెలిపారు. ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు కొనుగోలు ఉండవని పేర్కొన్నారు. మార్చి నుంచి యథావిధిగా కొనుగోలు జరుగుతాయని, రైతులు గమనించాలని కోరారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు

నార్నూర్, ఫిబ్రవరి 25 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి సంధ్యారాణి 85 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా పలువురికి కంటి సమస్య ఉన్నట్లు గుర్తించారు. వారికి త్వరలోనే కళ్ల అద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజమణి, నేత్ర వైద్య సహాయకులు విలాశ్, విజయ్, హెచ్ఈవో తులసీదాస్, ఆరోగ్య పర్యవేక్షకులు చౌహాన్ చరణ్‌దాస్, సిబ్బంది సునీత, ఈశ్వర్, జవహర్‌లాల్ పాల్గొన్నారు.

## ఫ్లేయర్ హైస్కూల్ వార్షికోత్సవం

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 25: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్ గ్రామంలోని ఫ్లేయర్ హైస్కూల్‌లో మంగళవారం పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నర్సింహారెడ్డి, విద్యార్థులు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వేసవిలో నిరంతరం విద్యుత్ సరఫరా

ఎదులాపురం, ఫిబ్రవరి 25 : వేసవిలో వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించడానికి లోడ్‌కు అనుగుణంగా సిబ్బంది, అధికారులు ఆహర్నిశలు శ్రమిస్తూ ముమ్మర చర్యలు చేపడుతున్నామని ఆదిలాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జేఆర్ చవాన్ ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో లోడ్ పెరిగే అవకాశం ఉన్న చోట ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడం జరిగిందన్నారు. 82 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. మూడు నెలల వేసవి కాల ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని తెలిపారు. అందుకు అనుగుణంగా సరిపడా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే లైన్లలో కెపాసిటర్ బ్యాంకులు పెట్టడం జరిగిందన్నారు. వీటి వలన సబ్ స్టేషన్, లైన్లలో విద్యుత్ సరఫరాలో ఓవర్ లోడ్ కాకుండా నియంత్రిస్తున్నదన్నారు. నష్టాలు కూడా చాల వరకు తగ్గుతాయని పేర్కొన్నారు. టెక్నికల్ నష్టాలు ఘననీయంగా తగ్గుతాయాన్నారు. వేసవిలో ఎటువంటి అంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు.

## టైలర్ దుకాణంలో అగ్ని ప్రమాదం

గుడిహత్నూర్, ఫిబ్రవరి 25 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని మాన్కాపూర్ గ్రామంలో మంగళవారం టైలర్ దుకాణంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాన్కాపూర్ గ్రామంలో మాన్కుబాయి టైలర్ దుకాణం నడుపుతుంది. రోజువారిగా ఉదయం దుకాణం తెరిచి దేవుని వద్ద దీపం ముట్టించే సమయంలో ప్రమాదవశాత్తు దుస్తులకు నిప్పు అంటుకొని మంటలు వచ్చాయి. మంటలు ఆర్పేందుకు స్థానికులు యత్నించిన అందులో ఉన్న దుస్తులు, నిత్యావసర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో గాయపడిన మహిళను అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

## దొంగ అరెస్టు: రిమాండ్‌కు తరలింపు

ఎదులాపురం, ఫిబ్రవరి 25: ఆదిలాబాద్‌లోని శాంతినగర్‌లో ఈ నెల 8వ తేదీన ఓ ఇంట్లో దొంగతనం చేసిన యువకుడిని అరెస్టు రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. అదే కాలనీలో నివాసముంటున్న షేక్ తబ్రీజ్(19)ని మంగళవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో నేతాజీ చౌక్‌లో అదుపులో తీసుకొని రిమాండ్ తరలించామని పేర్కొన్నారు.

## పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 25: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రామారావు సూచించారు. మంగళవారం నిర్మల్‌లోని సోమవార్‌పేట్ బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి వంట సిబ్బందితో మాట్లాడారు. వారికి పలు సూచనలు చేశారు. అక్కడి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు ఎలా సన్నద్ధం అవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో మూడో సారి ప్రథమ స్థానం తీసుకురావాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



మేళాను ప్రారంభిస్తున్న తహసీల్దార్, సీఐ, ఎస్ఐ

బోథ్, ఫిబ్రవరి 25 : విద్యార్థులు కష్టపడి చదివి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సీఐ వెంకటేశ్వర్ రావ్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని వేదం పాఠశాలలో జాతీయ వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా ముందస్తుగా విజ్ఞాన మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ సుభాష్ చందర్, సీఐ వెంకటేశ్వర రావ్, ఎస్ ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల ప్రదర్శనలు తిలకించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంతోష్ ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 25: ఇథనాల్ పరిశ్రమ రద్దు చేయాలని గత సంవత్సరం నవంబర్‌లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను మండలంలోని దిలావర్‌పూర్, గుండంపల్లి, సముందర్‌పల్లి, కాండ్లీ గ్రామాలకు చెందిన గ్రామస్తులు బహిష్కరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో తిరిగి సమగ్ర కుటుంబ సర్వేను అన్ని గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు ఇతర సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది కలిసి ఇంటింటికీ తిరిగి సమగ్ర కుటుంబ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఈ సర్వేను నిత్యం ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో గోవర్ధన్ పరిశీలిస్తూ ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేస్తున్నారు.

## బీమా చెక్కు అందజేత

భైంసా, ఫిబ్రవరి 25 : నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని మిర్జాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పెండుపల్లి గ్రామానికి చెందిన రైతు దేశెట్టి మహేందర్ క్రాప్‌లోన్ తీసుకొని ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు రూ. 2లక్షల బీమా చెక్కును పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సీఈవో రాజేందర్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో విక్రయానికి వచ్చిన కందులు

## పోటెత్తిన కందులు

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో మంగళవారం రైతులు కందులను విక్రయించడానికి భారీగా తరలివచ్చారు. దీంతో కందుల కొనుగోలు కేంద్రం నిండిపోయింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పంట కొనుగోళ్లు జరుగుతుండగా ప్రభుత్వం మొదట ఎకరాకు 3.30 క్వింటాళ్ల కందులను మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రకటించింది. ఎకరాకు 6 నుంచి 7 క్వింటాళ్ల పంట దిగుబడి రాగా ప్రభుత్వ నిబంధనలతో రైతులు ఇబ్బందులు పడ్డారు. పంటను విక్రయించడానికి మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రాలకు తీసుకురాలేదు. ఇటీవల నిబంధనలు సడలించి ఎకరాకు 6 క్వింటాళ్లను కొంటామని ప్రకటించడంతో రైతులు భారీగా పంటను తీసుకుని వచ్చారు.

- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, ఫిబ్రవరి 25

## క్రికెట్ పోటీల విజేత ఇచ్చోడ జట్టు



బహుమతి అందజేస్తున్న బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్

బోథ్, ఫిబ్రవరి 25: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని లాల్‌పిచ్ మైదానంలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఫైనల్ పోటీల్లో ఇచ్చోడ, బోథ్ జట్లు తలపడ్డాయి. ఇచ్చోడ జట్టు గెలుపొందింది. విజేతలకు బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ పరిధిలో క్రీడాభివృద్ధి కోసం ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. యువతకు ప్రోత్సహిస్తూ క్రీడ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రణయ్, బిక్క లక్ష్మణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న విద్యార్థి సంఘం మండల ప్రధాన కార్యదర్శి సంతోష్

నార్నూర్, ఫిబ్రవరి 25 : గ్రామీణ యువత జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) విద్యార్థి సంఘం మండల ప్రధాన కార్యదర్శి పెందోర్ సంతోష్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం దాబా(బీ)గ్రామంలో మహాశివరాత్రి పురస్కరించుకుని హనుమందిర్ ప్రాంగణంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆత్రం విజయ్, మెస్రం గోవింద్, అనిల్, సోనేరావ్, బాదిరావ్, మాజీ సర్పంచ్ తానాజీ, ఆనంద్‌రావ్, మాణిక్‌రావ్, శంకర్, చిత్రు, మారుతి, క్రీడాకారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భైంసా, ఫిబ్రవరి 25 : నిర్మల్ జిల్లా భైంసాలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. తానూర్ మండలం ఎల్వీ గ్రామానికి చెందిన సాయినాథ్ ,అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్ బైక్‌పై నిర్మల్ నుంచి భైంసా వైపు వస్తుండగా, స్థానిక సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొని కింద పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. దీంతో వారు చేరుకొని స్థానిక ఏరియా దవాఖానకు తరలించారు.

## చికిత్స పొందుతూ ఒకరు మృతి

ఎదులాపురం, ఫిబ్రవరి 25: ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మహారాష్ట్రకు చెందిన సట్పుటే దత్తు (22) మంగళవారం మృతి చెందినట్లు టూ టౌన్ ఎస్ఐ విష్ణు ప్రకాశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. యవత్మాల్ జిల్లాలోని దగడ్‌లాల్ గ్రామానికి చెందిన దత్తు కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన ఆయన ఉమర్‌ఖేడ్ తాలూకాలోని కొర్ట గ్రామంలో తమ బంధువుల పంట చేనులో ఈ నెల 22వ తేదీన పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

## అన్ని రకాల పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 25: నిర్మల్ జిల్లాలోని మున్సిపాల్టీల్లో అన్ని రకాల పన్నుల వసూలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్మల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపాల్టీల్లో వాణిజ్య, నీటి, వ్యాపార ప్రకటనల పన్నుల వసూలును 100 శాతం పూర్తి చేయాలన్నారు. మున్సిపాల్టీల వారీగా పన్నుల వసూలు లక్ష్యం ఇప్పటి వరకు వసూలైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ మొత్తంలో పన్నులు కట్టని వారి జాబితాను సిద్ధం చేయాలని, అందులో మొదటి 100 మందికి రెడ్ నోటీసులు జారీ చేయలన్నారు. వాణిజ్య లైసెన్సుల పునరుద్ధరణ ప్రక్రియ త్వరతిగతిన పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు జాదవ్ కృష్ణ, రాజేశ్ కుమార్, డీఈ హరి భువన్ పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్



మాట్లాడుతున్న భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్

భైంసా, ఫిబ్రవరి 25 : నేరాలు నియంత్రించేందుకు కార్డన్ సర్చ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఏఎస్పీ అవినాశ్‌కుమార్ అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా భైంసాలోని రాజీవ్‌నగర్, ఓవైసీ నగర్ ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు ఈ కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఇందులో 105 ద్విచక్రవాహనాలు, నాలుగు ఆటోలు ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం సహకరించాలని సూచించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ లేకుండా ప్రయాణించకూడదని తెలిపారు. వాహనాలకు ఎలాంటి పత్రాలు లేకపోయిన సీజ్ చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ గోపీనాథ్, ఎస్ఐ గౌస్ పాల్గొన్నారు.

## భర్తకు ఆరు నెలలు జైలు ...

ఎదులాపురం, ఫిబ్రవరి 25 : అదనపు కట్నం కోసం వేధించిన భర్తకు ఆరు నెలలు జైలు శిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి దుర్గ రాణి తీర్పు వెలువరించినట్లు జిల్లా కోర్టు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. ఆదిలాబాద్‌లోని రాంనగర్‌కు చెందిన మహ్మద్ షాహిస్తా పర్వీన్‌కు హౌసింగ్‌బోర్డుకు చెందిన మహ్మద్ రిజ్వాన్‌తో 12 అక్టోబర్ 2014లో వివాహం జరిగింది. ఆ పెండ్లిలో రూ.50 వేలు, ఎనిమిదిన్నర తులాల బంగారం, ద్విచక్ర వాహనం, రూ.8 లక్షలు విలువ గల ఇంటి సామగ్రి కానుకగా ఇచ్చారు. సంవత్సరం వరకు కాపురం సాఫీగా సాగింది. ఆ తర్వాత ఒక కుమారుడు కుమార్తె జన్మించారు. అత్తమామలు రూబియా సుల్తానా, మహ్మద్ ఇస్మైల్, మరిది మహ్మద్ ఇర్ఫాన్ అదనపు కట్నం రూ.2లక్షలు తీసుకురావాలని వేధిసుండే వారు. 25 మే 2017 మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ ఎల్ రాజు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. 11 మంది కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా అదనపు పీపీ నవీన్ కుమార్ కేసును వాదించగా నేరం రుజువు కావడంతో భర్తకు ఆరు నెలలు జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు విలువరించినట్లు లైజన్ అధికారి తెలిపారు.

## అత్యాచార ఘటనపై స్పందించని మంత్రి సీతక్క



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు సాజీదుద్దీన్

ఎదులాపురం, ఫిబ్రవరి 25 : బాలిక అత్యాచార ఘటనపై ఇన్‌చార్జి మంత్రి, ప్రభుత్వం స్పందించకపోవడం సమంజసం కాదని బీఆర్ఎస్ నాయకుడు సాజీదుద్దీన్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. మైనారిటీ బాలికపై అత్యాచారం జరిగిన ఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అత్యాచార ఘటనపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఇప్పటికీ స్పందించలేదని మండిపడ్డారు. ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నాయకులు సలీం పాషా, అత్తర్ ఉల్లా, అడపా తిరుపతి, సలీమ్, జాహుర్, ముఖిద్, ఫేరోజ్, అయూబ్, పర్వీన్ సుల్తానా, కరుణ పాల్గొన్నారు.

## కష్టపడి చదువుకుని తమ కాళ్లపై నిలబడాలి



మాట్లాడుతున్న డీసీపీవో రాజేంద్రప్రసాద్

ఎదులాపురం, ఫిబ్రవరి25: బంధువులు, తల్లిదండ్రులకు తక్కువ వయసు ఉన్న పిల్లలకు పెళ్లి చేద్దామనే ఆలోచన రావద్దంటే కష్టపడి చదువుకుని తమ కాళ్లపై నిలబడాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో బాల్య వివాహం, బాల కార్మికులు, బాలల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. బాగా చదువుకుంటే పెళ్లి చేయాలనే ఆలోచన తల్లిదండ్రులకు రాదన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలందరి కోసం పని చేయడానికి రాష్ట్రంలో చాలా వ్యవస్థలు ఉన్నాయన్నారు. అందులో ఒకటి షూర్ ఎన్జీవో అన్నారు. మహిళా సాధికరత జిల్లా కోఆర్డినేటర్ యశోద మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగిన, చేస్తున్న ఎవరు కూడా భయపడకుండా 1098 నంబర్‌కు ధైర్యంగా ఫోన్ చేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, ప్రిన్సిపాల్ లలిత కుమారి, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సతీశ్, షూర్ ఎన్జీవో డిస్ట్రిక్ ఆర్డినేటర్ వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

## మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భైంసా, ఫిబ్రవరి 25 : రాష్ట్రంలో మళ్లీ రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ నాయకుడు విలాస్‌గాదేవార్ అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా భైంసాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాది పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో పదేళ్లు వెనక్కి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు చేయడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఏడాది పాటు కాంగ్రెస్ పాలనను చూసిన ప్రజలు తిరిగి మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మ సురేశ్, రావుల పోశెట్టి, దిలీప్, భీమేశ్, మహిపాల్, రామ్‌రెడ్డి, సాయి పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రం పరిశీలన

కుంటాల, ఫిబ్రవరి 25 : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో మంగళవారం నిర్మల్ జిల్లా కుంటాలలోని పోలింగ్ కేంద్రాన్ని భైంసా రూరల్ సీఐ నైలు పరిశీలించారు. ఎన్నికల నియమావళి అందరూ పాటించాలని కోరారు. ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ భాస్కరాచారి, ఎంఈవో ముత్యం , సిబ్బంది ఉన్నారు



కుంటాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న భైంసా రూరల్ సీఐ నైలు

## మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మహిళా సంఘాలకు చెక్కు పంపిణీ చేస్తున్న డీఆర్డీవో, బ్యాంకు అధికారులు

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 25 : మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. నిర్మల్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా సంఘాలకు రూ. 50 కోట్ల రుణాల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా పొందుతున్న రుణాలు కొత్త కొత్త వ్యాపారాలు చేయడానికి వినియోగించి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మల్ జిల్లాలోని మహిళా సంఘాలు అతి తక్కువ ఎన్‌పీఏతో తమ యొక్క ఘనతను చాటారన్నారు. కార్యక్రమంలో ఎల్డీఎం రామ్‌గోపాల్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ రామారావు, ఏపీడీ జ్ఞానేశ్వర్, విలాస్, అభినయ పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి



మాట్లాడుతున్న నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 25 : ముస్లింలు శాంతియుత వాతావరణంలో రంజాన్ పండుగను జరుపుకోవాలని ఏఎస్పీ రాజేశ్ మీనా అన్నారు. మంగళవారం నిర్మల్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రంజాన్ మాసంలో అందరూ సంయమనంతో శాంతియుతంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి ఘర్షణలు గొడవలు జరుగకుండా మత పెద్దలు చర్యలు చేపట్టాలని, మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పోస్టులు చేయరాదన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ముస్లింలు, మత పెద్దలు పాల్గొన్నారు.

## వీడ్కోలు హంగామా



ఎదులాపురం: నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఎదులాపురం, ఫిబ్రవరి 25 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు వీడ్కోలు వేడుక నిర్వహించారు. విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు జాదవ్ గణేశ్, భగవాండ్లు, ధన్‌రాజ్, అధ్యాపకులు ప్రేమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తాంసిలో..

భీంపూర్, ఫిబ్రవరి 25 : ఆదిలాబాద్ జిల్లా తాంసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటాపాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్, ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ సంతోష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

### వాసవి హైస్కూల్‌లో..



కుంటాల: నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కుంటాల, ఫిబ్రవరి 25 : నిర్మల్ జిల్లా కుంటాలలోని వాసవి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఆటాపాటలు, మిమిక్రీ, నాటికలతో ఉల్లాసపర్చారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, వాసవి విద్యాసంస్థల చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, ప్రిన్సిపాల్ గట్టుపల్లి శ్రీనివాస్, సంతోష్, సంయుక్త కార్యదర్శులు జానకిరామ్, హరిప్రసాద్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 25: నిర్మల్ జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీటీవో రమణారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్, సఖీ కేంద్రం సందర్శన

ఎదులాపురం, ఫిబ్రవరి 25: మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం మహిళా పోలీసు స్టేషన్, సఖీ కేంద్రం సందర్శించారు. పోలీసు స్టేషన్ పని తీరుపై అవగాహన, రిపోర్టులు ఎలా ఫైల్ చేయాలనే విషయాలపై ఏఎస్ఐ అనిత అవగాహన కల్పించారు. వేధింపులు, హింస వంటి సమస్యలకు పోలీసు సహాయం ఎలా పొందాలో వివరించారు. సఖీ కేంద్రం సేవలను సెంటర్ అడ్మిన్ సరస్వతి తెలిపారు. కార్యక్రమంలో సఖీ సెంటర్ అడ్మిన్ సరస్వతి, డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా కో ఆర్డినేటర్ యశోద, సిబ్బంది, ప్రభుత్వ బాలికల పాఠశాల భుక్తాపూర్ టీచర్ సారా పాల్గొన్నారు.

## నగదు రహిత లావాదేవీలపై అవగాహన

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 25: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని కొలాంగూడ గ్రామంలో నాబార్డు వారి సౌజన్యంతో ఏడీసీసీ బ్యాంకు అధ్వర్యంలో మంగళవారం రైతులకు వ్యవసాయ నగదు రహిత లావాదేవీలపై, స్త్రీనిధి డిపాజిట్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ అధికారి రాజు, గ్రామ పటేల్ టేకం రాజు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.